ఉప కారాగారం సందర్శన

ప్రజాశక్తి - చింతలపూడి

ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సోమవారం చింతలపూడి సబ్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా కె.రత్న ప్రసాద్ నిందితుల కేసుల వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, మంచినీటి సౌకర్యాలు, అనారోగ్యంగా ఉన్న వారి గురించి ఆరా తీశారు. జైలు ప్రాంగణంలో ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ కృపానందం, పానల్ అడ్వకేట్ ఎల్‌వి.చైతన్య, పిఎల్‌విఎన్.ఏసు రత్నం, కోర్టు సూపరింటెండెంట్ పి.గుర్వినాయుడు, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జడ్జి

పోలవరం జిల్లాలో.. 'పోలవరం' లేదాయే..!

జిల్లాల పునర్విభజనకు కేబినెట్ ఆమోదం
పోలవరం జిల్లాపై ప్రజల అభీష్టానికి విరుద్ధంగా సర్కార్ ముందుకు
రంపచోడవరం, చింతూరు డివిజన్లతోనే పోలవరం జిల్లా
ఏలూరు జిల్లాలోని ఆదివాసీలకు సర్కార్ వెన్నుపోటు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం జిల్లాలో 'పోలవరం' లేకుండా చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతోంది. జిల్లాల మార్పులపై ప్రజల అభీష్టాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో జిల్లాల మార్పులకు సంబంధించి ఆమోద ముద్ర పడింది. 31వ తేదీన తుది నోటిఫికేషన్ విడుదల చేయడం, జనవరి ఒకటో తేదీ నుంచి చేసిన మార్పులు అమల్లోకి రానున్నాయి. జిల్లాలోని ఆదివాసీలకు తీరని అన్యాయం చేసిన చంద్రబాబు సర్కార్‌పై గిరిజనుల నుంచి తీవ్ర ఆగ్రహజ్వాలలు వ్యక్తమవుతున్నాయి. తాము అధికారంలోకి వస్తే ఏజెన్సీ ప్రాంతాలను పోలవరం జిల్లాగా ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలో కొయ్యలగూడెంలో జరిగిన బహిరంగ సభలో సిఎం చంద్రబాబు ప్రకటించారు. దీంతో జిల్లాలోని ఆదివాసీలంతా ఆ ప్రకటనను స్వాగతించారు. ఎన్నికల్లో కూటమికి ఓట్లు వేసి గెలిపించారు. జిల్లాల విభజనకు సంబంధించి మార్పులు, చేర్పులు చేపట్టిన ప్రభుత్వం గత నెల 27న ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. రంపచోడవరం, చింతూరు డివిజన్లతో పోలవరం జిల్లా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. దీంతో పోలవరం నియోజకవర్గం లేకుండా పోలవరం జిల్లా ఏర్పాటు చేయడంపై తీవ్ర ఆగ్రహ జ్వాలలు వ్యక్తమయ్యాయి. ఏజెన్సీ బంద్ సైతం జరిగింది. ఆందోళనలు, నిరసనలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు సాగాయి. జిల్లా ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సైతం అందించారు. ప్రభుత్వం మాత్రం ప్రజల అభిప్రాయానికి ఏమాత్రం విలువ లేకుండా ప్రాథమిక నోటిఫికేషన్‌లో ప్రకటించినట్లుగానే పోలవరం జిల్లా ఏర్పాటుకు ఆమోద ముద్ర వేసింది. దీంతో పోలవరం నియోజకవర్గంలోని గిరిజనులకు తీరని అన్యాయం చేసింది. పోలవరం నిర్వాసితులంతా పోలవరం నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ఉన్నారు. ఏజెన్సీ ప్రాంతాలను జిల్లాగా ఏర్పాటు చేస్తున్నప్పుడు ఏలూరు జిల్లాలోని ఏజెన్సీ మండలాలను విస్మరించడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. పోలవరం నియోజకవర్గం లేకుండా పోలవరం జిల్లా ఏర్పాటు చేయడం ఏమిటనే ప్రశ్న అందరినీ తొలిచేస్తోంది.

పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం కలపాలని ఆందోళన (ఫైల్‌ఫోటో)

సమస్యలపై రెవెన్యూ క్లినిక్‌లు

అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో ప్రారంభం
జిల్లావ్యాప్తంగా 316 ఫిర్యాదులు స్వీకరణ
వేగంగా సమస్యల పరిష్కారానికి అడుగులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ క్లినిక్‌లను ప్రారంభించింది. సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమంతోపాటు రెవెన్యూ క్లినిక్‌లను జిల్లాలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లోనూ ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టరేట్‌లోనూ రెవెన్యూ క్లినిక్‌లను ప్రారంభించి రెవెన్యూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జనాల్లో తీవ్ర అసంతృప్తి ఉందనే అభిప్రాయంతో ప్రభుత్వం రెవెన్యూ క్లినిక్‌లకు శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించిన ప్రభుత్వ ఆదేశాలు రావడం, వెంటనే క్లినిక్‌ల ఏర్పాటు జరిగిపోయింది. ఇక నుంచి ప్రతి సోమవారం రెవెన్యూ క్లినిక్‌లు జరగనున్నాయి. సోమవారం ప్రారంభించిన రెవెన్యూ క్లినిక్‌లో మొత్తం 316 వరకూ ఫిర్యాదులు అందినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఎన్నోఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు ఈ రెవెన్యూ క్లినిక్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రెవెన్యూ క్లినిక్‌లతో సమస్యలకు సత్వర పరిష్కారం చూపేలా ఆదేశాలు జారీ అయ్యాయి. రెవెన్యూ క్లినిక్‌ల్లో మండలంలోని రెవెన్యూ రికార్డులను అందుబాటులో ఉంచుకుంటారు. గ్రామ అడంగల్, ఎఫ్ఎంబి, వెబ్‌ల్యాండ్ ఇతర రికార్డులు అధికారుల వద్ద సిద్ధంగా ఉంటాయి. ప్రత్యేక రెవెన్యూ క్లినిక్‌ల్లో పిటిషనర్ ఏ సమస్యపై వచ్చారు, సమస్య పరిష్కారానికి తగిన డ్యాకుమెంట్లు తీసుకొచ్చారా వంటివి పరిశీలించి ఏం చేయాలో చెబుతారు. రికార్డులను పరిశీలించి భూమి స్వభావం, సమస్య, దాని పరిష్కారంపై చేపట్టే కార్యాచరణ రిపోర్ట్‌ను ఫిర్యాదుదారునికి అందజేస్తారు. సివిల్ వివాదమైతే కోర్టుకు వెళ్లి పరిష్కరించాలని సూచిస్తారు. ఈ విధంగా ఫిర్యాదుదారుని రెవెన్యూ సమస్య ఏమిటో తెలుసుకుని పరిష్కారం దిశగా కృషి చేస్తారు. రెవెన్యూ క్లినిక్‌ల ఏర్పాటుతో భూముల సమస్యకు పరిష్కారం దొరుకుతుందని జనం ఆశిస్తున్నారు. తొలిరోజు రెవెన్యూ క్లినిక్‌ల్లో స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారం దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. రెవెన్యూ క్లినిక్‌లతో ప్రజలకు ప్రయోజనం జరుగుతుందని అంతా ఆశిస్తున్నారు.

అర్జీలు అందిస్తున్న జనం

గిరిజనులపై నిర్బంధం ఆపాలి

పంట ధ్వంసంపై నష్టపరిహారం చెల్లించాలి
తప్పుడు కేసులు ఎత్తివేయాలి
దాడికి పాల్పడ్డ తహశీల్దార్, ఎస్ఐ, భూస్వాములపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
ఆదివాసీ గిరిజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా


ఆర్‌డిఒ కార్యాలయం వద్ద బైఠాయించిన గిరిజనులు

వినతిపత్రం అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

గిరిజనులపై దాడి చేసి పెట్టిన తప్పుడు కేసులను ఎత్తి వేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆదివాసీ గిరిజన సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఇనుమూరు గిరిజనులపై దాడులను ఖండించాలని, తప్పుడు కేసులు ఎత్తివేయాలని, గిరిజన భూసమస్యలు పరిష్కరించాలని స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు గిరిజన సంఘం జిల్లా నాయకులు మొడియం నాగమణి అధ్యక్షత వహించారు. ధర్నానుద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇనుమూరులో 57 గిరిజన కుటుంబాలు సాగు చేసిన మొక్కజొన్న పంటను నాశనం చేయడంతోపాటు గిరిజన మహిళలపై విచక్షణారహితంగా దాడి చేసిన పోలీసు, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజనులపై దాడికి వచ్చిన రెవెన్యూ అధికారులు, పోలీసులు గిరిజన చట్టాలపై అవగాహన, స్పష్టత ఉందా, లేకపోతే కాసుల కోసం గిరిజనేతరులకు అండగా ఉండేందుకు వచ్చారో అర్థం కావడం లేదన్నారు. పంటలను ధ్వంసం చేసి, గిరిజనులు, గిరిజన మహిళలపై దాడికి పూనుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని, ధ్వంసమైన పంటకు గిరిజనులకు పరిహారం చెల్లించాలని, తప్పుడు కేసులు ఎత్తివేయాలని, దాడికి పాల్పడ్డ తహశీల్దార్, ఎస్ఐ, భూస్వాములపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇనుమూరు, ఏజెన్సీ ప్రాంత గిరిజన భూసమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా అన్ని సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

మహిళలపై దాడి.. ఆపై తిరిగి తప్పుడు కేసులు
సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

సుదీర్ఘకాలం నుండి బుట్టాయగూడెం మండలం అంతర్వేదిగూడెం రెవెన్యూలోని ఇనుమూరులో దీర్ఘకాలంగా గిరిజనులు సాగు చేసుకుంటున్న భూముల్లో ఈ నెల 23న గిరిజనేతర భూస్వాములకు అనుకూలంగా పోలీసులు, రెవెన్యూ అధికారులు, భూస్వాములు గిరిజనులు వేసిన మొక్కజొన్న పంటను దౌర్జన్యంగా ధ్వంసం చేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. అడ్డొచ్చిన గిరిజనులపై, రెవెన్యూ అధికారులు విచక్షణారహితంగా దాడి చేసి చివరికి గిరిజన మహిళలపై మగ పోలీసులే దాడి చేసి కొట్టారన్నారు. ఈ భూముల సమస్యపై హైకోర్టులో కేసు నమోదై ఉందని గుర్తు చేశారు. ఏజెన్సీ భూసమస్యల్లో పోలీసులు జోక్యం చేసుకోకూడదని జిఒ నెం.1049/28-7-2007 ఉన్నా పక్కనపెట్టి పోలీసుల జోక్యం సరైంది కాదన్నారు. జిఒకు విరుద్ధంగా పోలీసులు ఏజెన్సీ భూసమస్యల్లో జోక్యం చేసుకుని గిరిజనులను, పేదలపై నిర్బంధాన్ని ప్రయోగించి దాడులు చేస్తున్నారన్నారు. పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్లలో గిరిజనులపై దాడులు చేసినప్పుడు భూస్వాములపై ఒక్క కేసూ నమోదు కాలేదని, అయితే ఆ మూడు స్టేషన్లలో గిరిజనులపై వందలాది కేసులు నమోదయ్యాయని అన్నారు. ఈ దాడులపై నిలదీస్తున్న గిరిజన నేతలు తెల్లం రామకృష్ణ, పోలోజు నాగేశ్వరరావు తదితరులపై హత్యాయత్నం, దోపిడీ, దొంగతనం వంటి తప్పుడు కేసులతోపాటు పీడీ యాక్ట్ సైతం బనాయిస్తామని భయపెడుతున్నారన్నారు. దీనిపై పోలీసు అధికారులను ప్రశ్నిస్తే ఆర్‌డిఒ భూస్వాములకు అనుకూలంగా ప్రొటెక్షన్ ఆర్డర్ ఇచ్చినందుకే దాని అమలుకే తాము వచ్చామని చెప్తున్నారన్నారు. షెడ్యూల్ ప్రాంతంలో ఆర్‌డిఒ, తహశీల్దార్లకు ప్రొటెక్షన్ ఆర్డర్లు ఇచ్చే అధికారం లేకున్నా జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఇచ్చిన ప్రొటెక్షన్ ఆర్డర్ వల్లే ఈ ఘటన చోటుచేసుకుందన్నారు. ఐదో షెడ్యూల్ ఏరియాలో గిరిజనేతరులకు ప్రొటెక్షన్ ఆర్డర్లు ఇచ్చే అధికారం ఆర్‌డిఒకు లేకున్నా ఇటీవల కాలంలో మర్లగూడెం, జీలుగుమిల్లి మండలం చిర్రివారిగూడెం గ్రామాల్లో గిరిజనులకు అన్యాయం చేస్తూ ఇచ్చిన ప్రొటెక్షన్ ఆర్డర్లు ఆపాలని, లేనిపక్షంలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద వంటావార్పు చేపడతామని హెచ్చరించారు. ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజా రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.వి.రామకృష్ణ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన చట్టాలు అమలు చేయాలని, గిరిజనులకు భూమి దక్కే వరకు పేదల పోరాటానికి తమ సంఘం మద్దతిస్తుందన్నారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వ్యకాస జిల్లా అధ్యక్షులు తామా ముత్యాలమ్మ, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కారం భాస్కర్, మడకం సుధారాణి, బొరగం భూచంద్రరావు, చుండ్రు బుల్లెమ్మ, తెల్లం దుర్గారావు, గుండి గంగరాజు, తెల్లం సంకరుడు, రైతుసంఘం జిల్లా నాయకులు ఎస్.సీతారామయ్య, వెట్టి వీరయ్య, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్, వ్యకాస జిల్లా నాయకులు ఎం.జీవరత్నం, జి.వెంకట్రావు, కారం నాగదుర్గ, యాగాటి సీత, మడివి చలపతిరావు, ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సవలం రాంబాబు, గిరిజన జ్యోతి జిల్లా అధ్యక్షులు కూరం సత్యనారాయణ నాయకత్వం వహించారు. పెద్దసంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రం కోరుతూ పోలవరం బంద్ సంపూర్ణం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం కేంద్రంగా పోలవరం జిల్లా ప్రకటించాలని జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం బంద్ సంపూర్ణంగా సాగింది. పలు కార్యాలయాలు, వాణిజ్య దుకాణాలు మూతపడ్డాయి. కార్యక్రమానుద్దేశించి జిల్లా సాధన సమితి కన్వీనర్ నాళం గాంధీ, బుగ్గామురళీకృష్ణ, జల్లేపల్లి వెంకటనరసింహారావు (జెవి), కొటంరాజు రాంబాబు మాట్లాడారు. కార్యక్రమంలో ముత్యాల రాంబాబు, సొబ్బన మోహన్, మిడియం వెంకటస్వామి, కోరిసక నాగబాబు, రేలంగి సూర్యచంద్రం, తూరం సాయి, కొమ్ముశెట్టి వెంకటేశ్వరరావు, కోరిసక శ్రీను పాల్గొన్నారు.

మూతపడిన దుకాణాలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ ఢంకా

నూరుశాతం విజయమే లక్ష్యంగా కృషి
టిడిపి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్ఎ బడేటి చంటి


మాట్లాడుతున్న ఎంఎల్ఎ బడేటి చంటి

ఏలూరు సిటీ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాల్లో పార్టీ విజయ ఢంకా మోగించి రాష్ట్ర ముఖ్యమంత్రి, పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుకు కానుకగా అందిద్దామని టిడిపి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. టిడిపి జిల్లా అధ్యక్షునిగా పార్టీ ప్రకటించిన తర్వాత సోమవారం ఆయన ఏలూరులోని టిడిపి జిల్లా కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పార్టీ కార్యాలయంలోని పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలోనూ, పార్టీ శ్రేణుల సమావేశంలోనూ ఎంఎల్ఎ మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబు, యువనేత లోకేష్ ఎంతో నమ్మకంతో తనపై ఉంచిన గురుతర బాధ్యతకు శక్తివంచన లేకుండా, పూర్తిస్థాయి న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ, పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపుతూ పార్టీని ప్రగతి పథంలో నడపడంతో పాటు జిల్లాలో పార్టీని ఎదురులేని శక్తిగా తీర్చిదిద్దుతానని ధీమా వ్యక్తం చేశారు. మరీ ముఖ్యంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకాభిప్రాయంతో అన్నిచోట్ల అభ్యర్థులను ఎంపిక చేసి నూరుశాతం విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతామని చెప్పారు. పార్టీలోని ప్రతి కార్యకర్త పార్టీ కష్టకాలంలో అండగా ఉండి అధికారంలోకి రావడానికి ఎంతో కృషిచేశారని, అటువంటి వారికి తగిన గుర్తింపు ఇచ్చేందుకు తన పరిధిలో తాను శాయశక్తులా కృషిచేస్తానని చంటి హామీ ఇచ్చారు. ఇటీవల వైసిపి నాయకులు, కార్యకర్తలు రప్పా రప్పా అంటూ ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించేందుకు ప్రయత్నిస్తున్నారని, అటువంటి వారి ఆటకట్టించేందుకు కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఇకపై పార్టీ జిల్లా కార్యాలయంలో అన్ని నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండేందుకు వారానికి ఐదు రోజులు కానీ తాను కార్యాలయానికి వస్తానని, దీనిపై అందరితో మాట్లాడి సమయాలను నిర్దేశించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం జిల్లా వైస్ ప్రెసిడెంట్ గన్ని వీరాంజనేయులు, చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ బడేటి చంటికి జిల్లా అధ్యక్షుల పదవి రావడం ఎంతో సంతోషంగా ఉందని, ఆయనకు రానున్న రోజుల్లో మరిన్ని పదవులు రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బడేటి చంటికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్, ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, జిల్లా అధికార ప్రతినిధి పూజారి నిరంజన్ పాల్గొన్నారు.

కొనసాగిన అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరసన

నూజివీడు టౌన్: ప్రతిష్టాత్మక ఐటీలు, సెంట్రల్ యూనివర్సిటీలలో చదువుకుని 2010-14 సంవత్సరాలలో ఆర్‌జియుకెటిలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా చేరిన అధ్యాపకుల వేతనాలు పెంచాలని కోరుతూ చేస్తున్న శాంతియుత నిరసన దీక్ష సోమవారం 5వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు న్యాయంగా రావాల్సిన వేతనాల విషయమై గడిచిన ఐదేళ్లలో చాన్సలర్‌ని కలిసి తమ బాధలు చెప్పుకోవడానికి కూడా వీలులేని దుస్థితిని అనుభవించామన్నారు. గత ప్రభుత్వంలో ఎపిఎస్‌సిహెచ్ఇ ఛైర్మెన్, ఆర్‌జియుకెటి వైస్ ఛాన్సలర్‌గా పనిచేసిన హేమచంద్రా రెడ్డి, ఆర్‌జియుకెటి ఛాన్సలర్‌గా పనిచేసిన కెసిరెడ్డి యూనివర్సిటీని అన్ని రకాలుగా భ్రష్టుపట్టించారన్నారు. ఉన్నత విద్యను రాజకీయ నాయకులుగా పాలించి సాంకేతిక విద్యను జూనియర్ ఇంటర్, డిగ్రీ లెక్చరర్ కన్నా అధ్వానంగా మార్చేశారన్నారు. కెసి.రెడ్డి, హేమచంద్రారెడ్డి కలిసి అధ్యాపకులు వాళ్లను కలిసి మాట్లాడే పరిస్థితి లేకుండా నిరంకుశంగా భయపెట్టారని తెలిపారు. హేమచంద్రారెడ్డి స్నేహితుడు, ప్రస్తుత వైస్ చాన్సలర్ దగ్గరకు వెళ్లి తమ గోడును చెప్తుంటే 'నేను రిజైన్ ఇచ్చాను. నాకు సంబంధం లేదు' అని చెప్తున్నారన్నారు. తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో కూడా అర్థం కాని అయోమయ స్థితిలో ఉన్నామన్నారు. ఇక్కడ అధికారులు కూడా 'మేమంతా ఇన్‌ఛార్జిలుగా ఉన్నాము. మేమేమీ చేయలేము' అని చెప్పడం మమ్మల్ని మరింత ఆందోళనలోకి నెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రజాస్వామ్య ప్రభుత్వంలోనైనా తమ సమస్యలు కొలిక్కి వస్తాయని భావించిన మేము ప్రత్యామ్నాయం లేని పరిస్థితుల్లో మాత్రమే శాంతియుత నిరసనను ప్రారంభించామని, ప్రభుత్వం ఈ విషయంలో చొరవ తీసుకుని మాకు న్యాయం చేయాలని కోరుతున్నాము' అని ఆవేదన చెందారు. ఉన్నత విద్యాసంస్థల్లో శ్రమ దోపిడీని అరికట్టాలని, న్యాయంగా తమకు ఇవ్వాల్సిన వేతనాల విషయమై ఉన్నతాధికారులు సత్వరమే స్పందించాలని వారు నినదించారు. విద్యార్థులను అన్ని విధాలుగా తీర్చిదిద్దుతున్న తమ పట్ల, తమ కుటుంబాల పట్ల ఇలాంటి వివక్ష చూపించడం తగదని వాపోయారు. అనారోగ్యాలతోనూ, అప్పుల బాధలతోనూ అన్నిటినీ భరిస్తూ విధి నిర్వహణ చేస్తున్న తమ సమస్యల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. వీరికి సంఘీభావాన్ని ప్రకటిస్తూ కొంతమంది మెంటర్లు కూడా నిరసన దీక్షలో పాల్గొన్నారు.


నేలపై కూర్చుని నిరసన తెలుపుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

కార్మికుల సభకు కదలి రండి..

ప్రచార హోరు.. ఏర్పాట్లు జోరు

ఏలూరు అర్బన్: ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఎన్‌విడి.ప్రసాద్

సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో సోమవారం ప్రచారం హోరెత్తింది. జనవరి 4న విశాఖపట్నంలో నిర్వహించనున్న ప్రదర్శన, బహిరంగ సభకు కదలిరండి అంటూ నేతలు వివిధ రూపాల్లో సాగిస్తున్న ప్రచారం కార్మికులను కదిలిస్తోంది. 'మన మీటింగ్‌కు వెళ్దాం పద' అంటూ 4న విశాఖ తరలివెళ్లేందుకు జట్లు, పరిశ్రమలు, నివాస ప్రాంతాల వారీగా కార్మికులు చకచకా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సొంత ఖర్చుతో బస్సులు, రైళ్లు, ప్రత్యేక వాహనాల్లో వెళ్లేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు.

ఏలూరు అర్బన్: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు అఖిలభారత మహాసభలో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ తెలిపారు. సోమవారం సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో జనవరి 4న చలో విశాఖపట్నం తరలిరావాలని కోరుతూ స్థానిక డిసిసిబి సమీపంలో ఫ్లయ్ ఓవర్ దిగువన కార్మికులను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కార్మికులకు సంఘాలు పెట్టుకునే హక్కును కూడా కాలరాసేలా ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా అంతా ఐక్యంగా ఉద్యమించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.ఇస్సాక్, పంపన రవికుమార్, జె.గోపి, అమర్‌కుమార్, నాగేంద్ర, మాధవ్, ఎస్.రజిని, షేక్ షమీమా తదితరులు పాల్గొన్నారు.

నిడమర్రు: జనవరి 4న చలో విశాఖకు తరలిరావాలని హెల్త్ వర్కర్లు, ఆశా వర్కర్లు పిలుపునిచ్చారు. ఆ యూనియన్ల మండల కమిటీ సమావేశం భువనపల్లిలో కంచం సుబ్బలక్ష్మి అధ్యక్షతన జరిగింది. పిల్ల హరికుమారి మాట్లాడగా లక్ష్మీరమణ, దుర్గాదేవి, లలిత, శ్రీజ పాల్గొన్నారు.

ఉంగుటూరు: మండలంలో సిఐటియు అఖిల భారత మహాసభ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు నారపల్లి రమణారావు మాట్లాడగా మండల కన్వీనర్ సేరా అప్పారావు, అంగన్వాడీలు లిల్లీ గ్రేస్, సుజాత, ఝాన్సీ విజయ పాల్గొన్నారు.

కుక్కునూరు రూరల్: సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక జిసిసి కార్యాలయం నుండి మెయిన్ రోడ్డు వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడగా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు, సిఐటియు నేతలు కుంజా నాగలక్ష్మి, బాడిస సుజాత, కాక బాపనమ్మ, పాముల అన్నపూర్ణ, కమల, కారం నాగలక్ష్మి, గొంది దుర్గమ్మ, అర్ధ నాగమణి, శ్రావణి, పద్మ, మంగ, పున్నమ్మ పాల్గొన్నారు.

నూజివీడులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నేతలు

నూజివీడు టౌన్: పట్టణంలోని ట్రిబుల్ ఐటీలోని సెక్యూరిటీ, హౌస్ కీపింగ్ కార్మికులకు సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు సిఐటియు మహాసభ ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 4న విశాఖలో జరిగే ప్రదర్శన, బహిరంగ సభకు కార్మికులంతా తరలిరావాలన్నారు. అనంతరం పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలకు కరపత్రాలను పంపిణీ చేశారు.

కలిదిండి: కలిదిండి సెంటర్లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వి.భాస్కరరావు, డివి.సత్యనారాయణ, బి.రామనాగేంద్రరావు, పి.గోపి, జి.అనిల్ కుమార్, పి.పెద్దిరాజు, పి.సత్యనారాయణ, ఈదా రవి, పి.నాగరాజు, కె.ఆదినారాయణ, సమిల్లా ఖాన్, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని పట్టణంలో సోమవారం ఆటో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు బి.బాలరాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.వెంకటేశ్వరరావు, ఆటో యూనియన్ నాయకులు స్టాలిన్, ఆనందరావు, సురేష్ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: స్థానిక వినాయకుడి గుడి సెంటర్‌లో ఆటో వర్కర్స్ యూనియన్, హమాలీ జెట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు జెండా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు మాట్లాడారు. అనంతరం పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేస్తూ, మైక్ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు సిరిగిరి బంగారం, కాళిదాసు, సుబ్రహ్మణ్యం, షేక్ బాజ్జీ, బి.నాగరాజు, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు బి.రమేష్, సిహెచ్.శ్రీను, పి.గంగరాజు, పి.వెంకటేశు, బి.సుబ్బారావు, బి.రాము, కె.రామారావు, బి.ఏసు పాల్గొన్నారు.

కుక్కునూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న సిఐటియు నేతలు

కొయ్యలగూడెంలో జెండా ఆవిష్కరిస్తున్న ఆటో కార్మికులు

జంగారెడ్డిగూడెంలో ప్రచారాన్ని ప్రారంభిస్తున్న బాలరాజు

మంచినీటి ట్యాంక్ శుభ్రం

ప్రజాశక్తి కథనానికి స్పందించిన అధికారులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

శుభ్రం చేస్తున్న సిబ్బంది

మంచినీటి ట్యాంక్ గుండా రంగు మారిన నీరు వస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తుల ఆవేదనపై ప్రజాశక్తిలో ప్రచురించిన కథనంపై అధికారులు వెంటనే స్పందించారు. ఇఒపిఆర్డి నిఖిల్ మధు శరత్ ఆధ్వర్యాన ఆర్డబ్ల్యుఎస్ అధికారులు, పంచాయతీ సిబ్బంది సోమవారం మంచి నీటి ట్యాంక్ వద్దకు చేరుకొని నీటిని పరిశీలించారు. సిబ్బందితో పైప్ లైన్ బయటకు తీసి ఫ్లషింగ్ చేయించినట్లు తెలిపారు. ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్ను కూడా శుభ్రపరిచినట్లు తెలిపారు. అనంతరం నీటి నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షల కోసం ఆర్డబ్ల్యుఎస్ ల్యాబ్కు పంపించామన్నారు. అనంతరం వెలువడిన నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్పంచి రాజు, డిప్యూటీ ఎంపిడిఒ రత్నకుమారి, ఇన్ఛార్జి పంచాయతీ అభివృద్ధి అధికారి అశోక్ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తర ద్వార దర్శనం..

అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చర్యలు

ద్వారకాతిరుమలలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పి, ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వార దర్శనం ప్రతి భక్తునికి ఇబ్బంది లేకుండా జరిగేలా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక చినవెంకన్న ఆలయంలో ఏర్పాట్లను సోమవారం జిల్లా ఎస్పి కె.ప్రతాప్శివకిషోర్, గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజుతో కలిసి ఆమె పరిశీలించారు. అనంతరం దేవాలయ అతిథిగృహంలో అధికారులతో తగిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్యూలైన్లలో తోపులాటలు లేకుండా చూడాలన్నారు. ఎక్కడైనా తోపులాట జరిగితే వెంటనే భద్రతా సిబ్బంది పరిస్థితిని నియంత్రించి, సాధారణ స్థితికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పి మాట్లాడుతూ భద్రతను పర్యవేక్షించేందుకు కంట్రోల్రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ గత సంవత్సరం 35 వేల మంది భక్తులు విచ్చేశారని, ప్రస్తుతం ఇంకా ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఆర్డిఒ రమణ, డిఎంహెచ్ఒ డాక్టర్ పిజె.అమృతం, డిఎస్పి శ్రావణ్కుమార్, ట్రైనీ ఐపిఎస్ జయశర్మ, దేవాలయ చైర్మన్ ఎస్వివిఎన్. సుధాకర్రావు, ఇఒ ఎన్విఎస్ఎన్.మూర్తి, ఇఇ డివి.భాస్కర్, తహశీల్దార్ జెవి.సుబ్బారావు, ఎంపిడిఒ ప్రకాష్, సర్పంచి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యూలైన్లు, కంపార్ట్మెంట్లు, ఆలయం నుండి బయటకు వచ్చే మార్గాలు, పార్కింగ్, ఆలయంలో ఏర్పాట్లను వారు పరిశీలించారు.

గిరిజనులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

సిపిఎం మండల కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - నిడమర్రు

ఇనుమూరు గిరిజనులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని సిపిఎం మండల కమిటీ సమావేశం డిమాండ్ చేసింది. నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో గవర సత్యనారాయణ అధ్యక్షతన సిపిఎం మండల కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ యంత్రాంగం భూస్వాములు, గిరిజనేతరుల పక్షాన చేరి కొమ్ము కాయడమే కాకుండా గిరిజనులపై అక్రమ కేసులు, అరెస్టులు ఆపాలన్నారు. గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, గిరిజనులకు భూములు, చట్టాలకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోన శ్రీనివాసరావు, వెలగలేటి మోహన, లావేటి సోంబాబు, కానూరు రాజు, కమిలి నాని, కంప వరప్రసాద్ పాల్గొని మాట్లాడారు.

మానవత కృషి అభినందనీయం

జనసేన నాయకులు వట్టి పవన్ కుమార్

భీమడోలు: వివిధ రూపాల్లో ఇబ్బందులు పడుతున్న వారిని అన్ని విధాలుగా ఆదుకుంటున్న స్వచ్ఛంద సంస్థ మానవత, భీమడోలు శాఖ చేస్తున్న కృషి అభినందనీయమని జనసేన నాయకులు వట్టి పవన్ కుమార్ అన్నారు. పూళ్ల గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్.ఎం.పురం ఆవాస ప్రాంతంలో మానవత భీమడోలు శాఖ 150 మంది నిరుపేద వృద్ధులకు చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వట్టి పవన కుమార్ మానవత భీమడోలు శాఖ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శిగా పనిచేసిన వట్టి వీర వెంకట సత్యనారాయణ 102వ జయంతి పురస్కరించుకొని, ఆయన కుటుంబీకులు, మానవత అభివృద్ధి కమిటీ సభ్యులు వట్టి సుగుణాకర్ ఆయన జ్ఞాపకార్థం నిరుపేదలలో వృద్ధులకు టవల్స్, మంకీ క్యాప్లు, మహిళలకు టవల్స్, స్కార్ఫ్లు అతిథుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మానవత జిల్లా కార్యదర్శి సభ్యులు రామిశెట్టి గంగాధర రావు, మానవత భీమడోలు శాఖ సభ్యులు పాల్గొన్నారు.

2 నుంచి నూతన పాస్ పుస్తకాల పంపిణీ

ముదినేపల్లి: మండలంలో రీ సర్వే పూర్తయిన 25 గ్రామాల్లో జనవరి 2 నుంచి 9 వరకు గ్రామసభలు నిర్వహించి నూతన పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు తహశీల్దార్ లతీఫ్పాషా తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జనవరి 2న అల్లూరు, బొమ్మినంపాడు, సింగరాయపాలెం, కోమర్రు, 3న కొర్రగుంటపాలెం, గోకినపాడు, కాకరవాడ, ఊటుకూరు, 5న ఈడేపల్లి, దేవరం, దేవపూడి, వాడవల్లి, 6న పొద్దువాక, పెదకామనపూడి, చిగురుకోట, దాకరం, 7న పెయ్యేరు, మాధవరం, సంకర్షణపురం, చినపాలపర్రు, 8న గురజ, పెనుమల్లి, పెదపాలపర్రు, 9న ముదినేపల్లి, వడాలి గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయన్నారు. ఈ గ్రామ సభల్లో 10,910 నూతన పాస్ పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

పట్టణాభివృద్ధికి సహకరిస్తాం

అఖిలపక్ష సమావేశంలో అన్ని రాజకీయ పక్షాలు, సేవా సంస్థలు

చింతలపూడి: చింతలపూడి నగర పంచాయతీ అభివృద్ధికి అందరూ సహకరించాలని నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడిలో సిపిఎస్ కార్యాలయంలో పట్టణ అభివృద్ధిపై అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి పట్టణాభివృద్ధిలో చేయాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ముందుగా నియోజకవర్గ కేంద్రమైన చింతలపూడిలో గడచిన 18 మాసాలలో చేపట్టిన అభివృద్ధి పనులను సభికులకు వివరించారు. అనంతరం అభివృద్ధికి సంబంధించి పట్టణంలో చేపట్టే ప్రతిపాదనలను వివిధ పక్షాల ప్రతినిధులకు వివరించారు. రాబోయే సంవత్సర కాలంలో టౌన్ డెవలప్మెంట్ విజన్ ప్లాన్ 2026 చేపట్టబోయే పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎంఎల్ఎ వివరించారు. టౌన్ డెవలప్మెంట్ విజన్ ప్లాన్ 2026లో వాకింగ్ ట్రాక్, లేక్ బ్యూటిఫుల్, బోటింగ్, విగ్రహాలన్నీ ఒకచోటకు చేర్చి ట్యాంక్ బండ్లా అభివృద్ధి చేయడం, రోడ్డు జంక్షన్లో ఫౌంటేన్ల ఏర్పాటు, పార్కింగ్, కిస్ టౌన్, సిగ్నల్ లైటింగ్, బైపాస్ రోడ్డు డెవలప్మెంట్, గ్రీనరీ డెవలప్మెంట్, పార్కుల డెవలప్మెంట్ వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్టు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అభివృద్ధిలో తమ సహకారం ఉంటుందని రాజకీయ పక్షాల ప్రతినిధులు పేర్కొన్నారు.

ముక్కోటి ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు

ఆలయ కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు

ముదినేపల్లి: దేశంలోని రెండవ పూరీగా ప్రసిద్ధిగాంచిన మండలంలోని వడాలి పూరీ జగన్నాథస్వామి ఆలయంలో, గురజలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 30న ముక్కోటి ఏకాదశి వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున ప్రత్యేక గరుడ వాహనంపై ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిస్తారని, అనంతరం వీధుల్లో గ్రామోత్సవం నిర్వహిస్తామని, ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న వైసిపి

మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సిహెచ్.దుర్గాప్రసాద్

నూజివీడు టౌన్: గత వారం రోజుల నుండి అసత్య ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులను ఖండిస్తూ నూజివీడు మంత్రి కార్యాలయంలో టిడిపి నాయకులు పత్రికా సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సిహెచ్.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వం పూర్తి చేసిన టిడ్కో ఇళ్లు పేదలకు ఇవ్వకుండా రోడ్డున పడేసింది మీరేనని దుయ్యబెట్టారు. గతంలో పేకాట శిబిరాలు నిర్వహించింది మీరేనని గుర్తుచేశారు. అభివృద్ధిని ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ క్లినిక్

పలుచోట్ల వినతుల స్వీకరణ

జీలుగుమిల్లి : రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ క్లినిక్లను ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ జి.ఉదయ్భాస్కర్ తెలిపారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ క్లినిక్ను ఏర్పాటు చేయగా మండల వ్యాప్తంగా 8 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వీటిలో ఎటువంటి వివాదాలు లేని 5 అర్జీలను వేదిక వద్దే పరిష్కరించామని ఎండార్స్మెంట్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కె.శ్రీనివాస్, ఎంపిడిఒ వెంకటలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ కాంతమ్మ, వీఆర్ఓలు తిరుపతమ్మ, రామతులసి, జగదీశ్వర్, శాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

భీమడోలు : రెవెన్యూ సమస్యల వేగవంతమైన పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం సహకరిస్తుందని భీమడోలు తహశీల్దార్ బి.రమాదేవి తెలిపారు. భీమడోలు తహశీల్దార్ కార్యాలయం వేదికగా సోమవారం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. భూముల సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమంతో సమాంతరంగా, ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. దీని నిర్వహణకు తహశీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 12 ప్రధాన రెవెన్యూ సమస్యలతో పాటు సర్వే ఇతర సమస్యల పరిష్కారానికి దరఖాస్తుల స్వీకరణ చేస్తున్నామన్నారు. అర్జీదారులు దరఖాస్తులు సమర్పించగానే తహశీల్దార్ వాటిని పరిశీలించి, తక్షణమే పరిష్కారం అయ్యే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తారన్నారు. ఈ విధంగా ఆస్కారం లేని సమస్యలపై పూర్తిస్థాయి విచారణ జరిపి, వాస్తవాలను పరిశీలించి నిర్ణీత కాలంలో వాటి పరిష్కారానికి కృషి చేస్తామని వివరించారు.

విద్యార్థులు సరైన లక్ష్యాన్ని కలిగి ఉండాలి : ఎంపిడిఒ

ముసునూరు : జీవితంలో ప్రతి విద్యార్థికి పదో తరగతి ఒక ప్రథమ మెట్టు లాంటిదని, దానిని అవలీలగా సాధించి అత్యుత్తమ మార్కులు సాధించాలని ఎంపిడిఒ పిల్లి ఏసుబాబు పేర్కొన్నారు. సోమవారం చెక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి బివిఎస్.సుబ్బారావు ఆధ్వర్యాన పదవ తరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడారు. జీవితంలో మొదటి మెట్టు పదవ తరగతి అని, ఉత్తీర్ణులు అవ్వటానికి ఒత్తిడి లేకుండా ఏవిధంగా చదవాలో విద్యార్థులకు మెలకువలు చెప్పారు. పదవ తరగతి తరువాత ఎంచుకునే కోర్సులు వారి అభిష్టానికి అనుగుణంగా ఎంచుకోవాలని, అప్పుడు మాత్రమే జీవితాంతం సంతోషంగా, సంతృప్తిగా ఉండగలుగుతారని దిశా నిర్దేశం చేశారు. పాఠశాల ఇన్ఛార్జి ప్రధానోపాధ్యాయులు జి.పద్మ కిషోర్, గుడిమెళ్ల రాంబాబు, అబ్రహం పాల్గొన్నారు.

నేడు కరెన్సీ నోట్ల, నాణేల ప్రదర్శన

భీమడోలు: భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల వేదికగా మంగళవారం జ్ఞానం కార్యక్రమం పేర కరెన్సీ నోట్ల, నాణేల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ యలమర్తి రవీంద్ర కుమార్ తెలిపారు. దీనివల్ల విద్యార్థుల్లో జ్ఞానం, విజ్ఞానం పెరుగుట, పెద్దలలో ఆసక్తి, అనుభూతి కలిగించుట లక్ష్యంగా దీనిని నిర్వహిస్తున్నామన్నారు. ఇదే క్రమంలో పిల్లలలో పొదుపు అలవాటు, ఆర్థిక అవగాహన, చరిత్ర పట్ల ఆసక్తి పెరుగుతాయని అన్నారు. ఎగ్జిబిషన్ తరహాలో నిర్వహించే కార్యక్రమంలో ప్రత్యేక నాణేల ప్రదర్శన, ఫ్యాన్సీ కరెన్సీ ప్రదర్శన కొన్ని అంశాలుగా ఉంటాయని వివరించారు.

వైద్యుల నిర్లక్ష్యం వల్లే తన భార్య చనిపోయిందని ఫిర్యాదు

కలిదిండి: పాము కాటుకు గురైన తమ భార్యను కలిదిండి పిహెచ్సికి తీసుకు వస్తే డాక్టర్, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే చనిపోయిందని మండలంలోని వెంకటాపురంకు చెందిన సిద్దాబత్తుల దుర్గారావు కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ ఆదేశాలతో స్థానిక పిహెచ్సికి మృతురాలి భర్త, పిల్లలను పిలిపించి విచారణ చేసినట్టు జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నరేంద్ర కృష్ణ తెలిపారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. మృతురాలికి భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

మండవల్లి: నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు యుటిఎఫ్ శాఖ అందించిన స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యాశాఖాధికారి ఎస్.రత్నసునాదం తెలిపారు. భైరవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయులు వివి.రాజారావు ఆర్థిక సహాయంతో యుటిఎఫ్ శాఖ ముద్రించిన మోడల్ టెస్ట్ పేపర్లను లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు సోమవారం ఆమె చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఈ మోడల్ టెక్స్ట్ పేపర్లను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సద్వినియోగం చేసుకుంటే ఉత్తీర్ణత శాతం పెరుగుతుందని, పాఠశాలకు, గ్రామానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావడానికి అవకాశం ఉంటుందని అన్నారు. 2025వ సంవత్సరంలో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో లింగాల పాఠశాల జిల్లాలోని రెండవ స్థానంలో నిలిచిందన్నారు. ఈ స్టడీ మెటీరియల్ కూడా వినియోగించుకుని లింగాల పాఠశాలను జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే పదవ తరగతి 300 మంది విద్యార్థులకు యుటిఎఫ్ స్టడీ మెటీరియల్ను అందించడంలో విశేష కృషిచేసిన యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సిరిగిరి పిచ్చోడును ఈ సందర్భంగా ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి కె.ఆనంద్ కుమార్, మండల అధ్యక్షులు రాజేష్, పాఠశాల హెచ్ఎం జంగం కోటేశ్వరావు, ఉపాధ్యాయులు రవికుమార్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు

సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్


మాట్లాడుతున్న రత్నప్రసాద్

చింతలపూడి : బాల్య వివాహాలు పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు తీవ్ర హానిని కలిగిస్తాయని జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ తెలిపారు. చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భావి భారత్ భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా 'ప్రొటెక్ట్ టు డే – సెక్యూర్ టుమారో' అనే నినాదంతో బాల్య వివాహాల నిర్మూలన, పర్యావరణ పరిరక్షణపై న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు తీవ్ర హానిని కలిగిస్తాయని తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన పెంపొందితేనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం చింతలపూడి సర్కిల్ ఇన్స్పెక్టర్ టి.క్రాంతి కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణలో పోలీసు శాఖ పాత్రను వివరించటమే కాకుండా, విద్యార్థులకు భవిష్యత్తు ఎదుగుదలకు సూచనలు ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు విద్యార్థులు సామాజిక బాధ్యతతో చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎంఇఒ శ్రీకిరణ్, ఐటిసి కౌన్సిలర్ ఎన్.అశోక్ మాట్లాడుతూ విద్యార్థులు చైతన్యవంతులుగా మారి సమాజంలో మార్పుకు దోహదపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి పిజిఆర్ఎస్

ఎస్పి ప్రతాప్ శివ కిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వినతులు స్వీకరిస్తున్న ఎస్పి

ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో విజయవంతంగా నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రతి సోమవారం పోలీసు శాఖ ఆధ్వర్యాన నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఈ సోమవారం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పి నేరుగా పాల్గొని ఫిర్యాదుదారుల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఫోన్లోనే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 45 ఫిర్యాదులు అందాయని, వీటిలో భూ సమస్యలు, కుటుంబ తగాదాలు, మోసపూరిత లావాదేవీలు వంటి ఫిర్యాదులు ఉన్నాయని ఆయన తెలిపారు. వీటన్నిటిపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి నివేదిక అందించాలని అధికారులకు ఆదేశించామని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఫిర్యాదుదారులతో ఆయన మాట్లాడామని తెలిపారు. ఈ మధ్యకాలంలో సైబర్ నేరాల ఫిర్యాదులు ఎక్కువవుతున్నాయని, అప్రమత్తంగా లేకపోతే సైబర్ నేరగాళ్లు మన ఖాతాలను కొల్లగొడతారని వారికి సూచించారు. ఇన్స్టాగ్రామ్, ఫేస్బుక్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా సైబర్ నేరగాళ్లు మనల్ని అనుసరిస్తూ, మన వ్యక్తిగత వివరాలను సేకరిస్తూ, తద్వారా మనలను బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆయన తెలిపారు. సైబర్ నేరం వాట్సాప్ రూపంలో గానీ, ఎపికె ఫైల్స్ రూపంలో గానీ, అధిక వడ్డీల రూపంలో గాని జరుగుతూ ఉంటుందని ఆయన అన్నారు. సైబర్ నేరానికి గురైనట్లయితే సెంట్రల్ సైబర్ సెల్ 19 30 నెంబర్కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదుదారులకు శ్రీ సత్య సాయి సేవా ట్రస్ట్ సంస్థ ద్వారా భోజన సౌకర్యాన్ని కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పితో పాటు ఎఎస్పి నక్క సూర్యచంద్రరావు, ట్రెయినీ ఐపిఎస్ జై సూర్య, సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **VEDIGANJI NAVYA (Old Name)** D/o. K. Kishore, D. No 3-33, Malapalli, Vanguru Village, Pedavegi Mandal, Eluru district, A. P. I have changed my name as **KALAPARTHI NAVYA (New Name)** Here after my name is known as **KALAPARTHI NAVYA (New Name).**

ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు, కార్యకర్తలు

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని దేవరగొంది పునరావాస కాలనీలో శనివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో అభిమల్ల సత్యనారాయణకు చెందిన ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన సత్యనారాయణ కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న జనసేన మండల అధ్యక్షుడు గుణపర్తి చిన్ని ఆధ్వర్యాన బాధిత కుటుంబానికి రూ.22 వేల 500, ఒక చీర ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ అగ్నిప్రమాద బాధితులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని పేర్కొన్నారు. ప్రభుత్వంతో పాటు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి బాధిత కుటుంబానికి సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. అలాగే వెలుగు ఎపిఎం జేమ్స్ ఆధ్వర్యాన వెలుగు సిఎలు రూ.30 వేలు ఆర్థిక సహాయం అందించారు. పోలీస్ స్టేషన్ రైటర్ జెట్టి భీమశేఖర్ ఆయన కుమార్తెల సహకారంతో రూ.5 వేల ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కొణతాల ప్రసాద్, జనసేన మండల వైస్ ప్రెసిడెంట్ తెలగంశెట్టి రాంప్రసాద్, జనసేన ప్రధాన కార్యదర్శి చీకట్ల సాయి కృష్ణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి కాకి మణికంఠ(అయ్యప్ప), గ్రామ కమిటీ అధ్యక్షులు కరిబండి గనిరాజు, కొల్లూరి శ్రీను, కొరసం రమేష్, సిద్దన రామకృష్ణ పాల్గొన్నారు.

వికలాంగులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - భీమడోలు

మండల పరిధిలోని వికలాంగులకు భీమడోలు తహశీల్దార్ బి.రమాదేవి ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. భీమడోలులోని మూడు గుళ్ల ప్రాంగణంలో అఖిలాంధ్ర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యాన భీమడోలులోని ప్రముఖ ప్రయివేట్ విద్యాసంస్థలు శ్రీమాధురి జూనియర్ కళాశాల, పాలేటి విద్యాసంస్థ, గీతాంజలి విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యాన వికలాంగులకు నూతన సంవత్సరం పురస్కరించుకొని దుప్పట్లు, పండ్లు, పౌష్టికాహారం, భోజన ఏర్పాట్లను చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భీమడోలు తహశీల్దార్ పాల్గొన్నారు. ముందస్తు నూతన సంవత్సరం పురస్కరించుకొని వికలాంగుల తరపున కేక్ను కోశారు. వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ వికలాంగులకు సేవ చేయటం ఒక బాధ్యతగా స్వీకరించాలని కోరారు. వారికి అన్ని విధాల అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తెస్తే ప్రభుత్వపరంగా వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో వికలాంగులు తమ సంఘం తరపున సమస్యలను చర్చించుకోవడానికి, ఇతర కార్యక్రమాల నిర్వహణకు స్థలంతో పాటు భవన నిర్మాణానికి సహకరించాలని తహశీల్దార్కు విజ్ఞప్తి చేశారు. దీనికి తన వంతు సహకారాన్ని అందజేస్తానని తహశీల్దార్ హామీ ఇచ్చారు. అనంతరం శ్రీమాధురి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ కె.ప్రేమ్ కుమార్ను తగు రీతిలో సత్కరించారు.

మానవత ఆధ్వర్యాన విద్యార్థులకు కెరియర్ గైడెన్స్

ప్రజాశక్తి - భీమడోలు

ఆగడాల లంక జిల్లా పరిషత్ ఓరియంట్ ఉన్నత పాఠశాలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు, నీటి సరఫరా సమస్యలు తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థ మానవత భీమడోలు శాఖ చొరవతో దాతలు ముందుకు వచ్చారు. ఆగడాల లంక పాఠశాలలో 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు కెరియర్ గైడెన్స్, వ్యక్తిత్వ వికాసం తరగతులను సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కెరియర్ గైడెన్స్ విభాగం డైరెక్టర్ ఉమామహేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు రామిశెట్టి గంగాధర రావు విద్యార్థులకు వివిధ అంశాల పట్ల అవగాహన కల్పించారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని అభిలాషించారు. తమకు ఆసక్తిగల సబ్జెక్టులను కష్టపడి కాక ఇష్టపడి చదివి పూర్తిస్థాయి విద్యావంతులుగా మారి ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న చెట్టున పాడు గ్రామ మాజీ సర్పంచ్ భలే కాంతారావు తాగునీటి సమస్య పరిష్కారానికి విద్యార్థులు చేసిన విజ్ఞప్తిపై స్పందించారు. దాతలు, ఇతర ప్రముఖుల సహకారంతో మానవత ఆధ్వర్యాన సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భీమడోలు శాఖ సభ్యులు పసుపులేటి సాంబశివరావు, పాఠశాల హెచ్ఎం మీనా కుమారి పాల్గొన్నారు.

పాస్పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుగొండ మండలం, ములపర్రు, దొడ్డివారి పాలెం గ్రామానికి చెందిన నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. అద్దె ఇంటి నుండి సొంత ఇంటికి మారుతున్నప్పుడు నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. పాస్పోర్టు నెంబర్ : H9252627 గల పాస్పోర్టు ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రస్కు తెలియజేయగలరు.

దొడ్డి గణపతి, తండ్రి : కొండలరావు
దొడ్డివారిపాలెం, ములపర్రు
పెనుగొండ మండలం, ప.గో.జిల్లా.
సెల్ : 8143584493

మహారాజశ్రీ 3వ అదనపు సివిల్ జడ్జి కం మొబైల్ కోర్టు, ఏలూరు

E.P.No.12/2025 in O.S.No.81/2023

బిట్వీన్:
పైలా రామాంజనేయులు ...డిక్రీ హోల్డర్
AND
సప్పా వెంకట స్వర్ణలత ...జె.డి.ఆర్
భర్త: దుర్గారావు, డో.నెం. 20ఇ-4-54, సబ్బుల వారి వీధి, కొత్తపేట, 40వ డివిజన్, ఏలూరు.

పై నెంబరు ఇ.పి.లో మీయొక్క హాజరు నిమిత్తం పై కోర్టు వారు **ది.09-01-2026వ తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు వాయిదా వేసినారు.** కావున మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టు నందు హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల పై నెంబరు ఇ.పి. మీ పరోక్షమున విచారించబడునని తెలుసుకొనగలరు.

B.V.APPA RAO
B.KUMAR
Advocates, Eluru-1.
Cell: 94401 88346
ఏలూరు,
25-12-2025.

PUBLIC NOTICE
IN THE COURT OF IV ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION), ELURU
O.S.No.346/2025

Between:
Kayita Uma Sankar ...Plaintiff
And
Beesetti Nageswararao ...Defendant
To:
Beesetti Nageswararao, S/o.Kanakaiah, R/o.D.No.23A-1-4/2, Raghavachari Street, R.R.Pet, Eluru.

Whereas, the plaintiff has filed the suit in O.S.No.346/2025 against the defendant for recovery of the amount due under the suit promissory note. The plaintiff also filed petition in I.A.No.204/2025 for attachment of the petition schedule property belongs to the defendant before judgment, where as the Hon'ble Court ordered notice to you and posted the matter for your appearance. Therefore, you are called upon to appear before the Hon'ble Court on 05.01.2026 at 10.30 AM., and state your objections if any, else, the matter will be decided in your absence.

PYDI VENKATA RAJU
Advocate, Eluru.
Cell: 9885199811.

మహారాజశ్రీ 3వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) (మొబైల్ కోర్టు), ఏలూరు వారి కోర్టులో

O.S.255/2025

బిట్వీన్ :
శ్రీమతి పింజర్ల గోవర్ధనమ్మ ...వాది
మరియు
శ్రీమతి తూతిక లక్ష్మీభ్రమరాంబ ...ప్రతివాది
To.
శ్రీమతి తూతిక లక్ష్మీభ్రమరాంబ,
W/o.నాగేంద్రరావు, R/o.H.No.22C-1-122,
తూర్పు వీధి, 7వ డివిజన్, ఏలూరు.

పై నంబరు గల దావాలో ప్రతివాది యొక్క హాజరు నిమిత్తం ది.20-1-2026వ తేదీకి వాయిదా అయివున్నది. కావున ప్రతివాది ది.20-1-2026వ తేది ఉదయం 10.30 గంటలకు పైకోర్టు వారి ఎదుట ప్రత్యక్షంగా గానీ, ప్లీడరు ద్వారా కాని హాజరు కావలెను. లేనియెడల పై నంబరు దావా ప్రతివాది పరోక్షంలో తీర్మానించబడును.

బి.శ్రీలక్ష్మి,
అడ్వకేట్, ఏలూరు.
సెల్: 8019442114

మహారాజశ్రీ ఏలూరు మొదటి అదనపు జిల్లా కోర్టులో

ఐ.ఎ.నెం. 746/2023
M.V.O.P 361/2019

బిట్వీన్ :
కె.జయలక్ష్మి & 2 అదర్స్ ...పిటీషనర్లు
Vs
ఎ.శేషగిరిరావు & అదర్స్ ...రెస్పాండెంట్లు
R3 : అడబాల దుర్గా భూలక్ష్మి,
W/o. Late శేషగిరిరావు, వీరవాసరం గ్రామం.
R4 : అడబాల స్వామి నాయుడు,
S/o. Late శేషగిరిరావు, వీరవాసరం గ్రామం.
R5 : అడబాల రాజు, S/o. Late శేషగిరిరావు,
వీరవాసరం గ్రామం.
R6 : అడబాల బేబి ధనలక్ష్మి, D/o. Late శేషగిరిరావు, వయస్సు 24, స్త్రీ, D.No.8/1-4/A, మత్స్యపురి రోడ్, వీరవాసరం గ్రామం, మండలం, ప.గో.జిల్లా.

పై నెంబరు ఒపి యందు రెస్పాండెంటు 3 to 6 కు నోటీసు నిమిత్తం ది.20.1.2026కి వాయిదా అయి ఉన్నది. పై తేదీన 10.30 ని॥లకు శ్రీకోర్టు వారి యెదుట హాజరై ఆక్షేపణలున్నచో తెల్పుకోని యెడల కేసు మీ పరోక్షముగా తీర్మానించెదరు.

జగ్గవరపు సురేష్కుమార్ రెడ్డి
అడ్వకేట్, ఏలూరు.
సెల్: 9441606789

టిడిపి అధికార ప్రతినిధిగా శ్యామ్

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఏలూరు పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధిగా పులవర్తి శామ్యూల్ (శ్యామ్), ఉపాధ్యక్షునిగా పోసిన పాండురంగా రావులను నియమిస్తూ పార్టీ అధిష్టానం నియామకం చేసింది. మండలంలోని చిగురుకోట గ్రామానికి చెందిన శ్యామ్, ఊటుకూరు గ్రామానికి చెందిన పోసిన పాండు రంగారావులను పార్టీ అధిష్టానం గుర్తించి వారికి పదవులు రావడంతో మండలంలోని టిడిపి నాయకులు అభినందనలు తెలిపారు.

పాస్పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుగొండ మండలం, పెనుగొండ గ్రామం, చెరుకువాడ, బైపే వారి వీధి చెందిన కణితి మరియమ్మ భర్త : సత్యనారాయణ అను నేను నా యొక్క పాస్పోర్టుతో ఇంటి దగ్గర నుండి జిరాక్స్ సెంటర్కు వెళ్తుండగా నా యొక్క పాస్పోర్టు పడిపోయింది. నా యొక్క పాస్పోర్టు నెంబర్ : M8687339 గల పాస్పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్కు తెలియజేయగలరు.

కణితి మరియమ్మ, భర్త : సత్యనారాయణ
బైపె వారి వీధి, చెరుకువాడ, పెనుగొండ గ్రామం,
పెనుగొండ మండలం. ప.గో.జిల్లా
సెల్ : 9603955894

CHANGE OF NAME

I, **Velamati Nagendra Bhupathi** S/o. Velamati Venkata Subbarao residing at H.No: 24A-13-8, Kandukuri Viresalingam Street, Ashoknagar, Eluru, Eluru District, A.P. Pin-534002. I have changed my name from Velamati Nagendra Bhupati (Old Name) to **Velamati Nagendra Bhupathi (New Name),** hence forth I am being called as **Velamati Nagendra Bhupathi (New Name)** for all purposes

మహారాజశ్రీ 2వ ఎడిషనల్ సివిల్ జడ్జి ఏలూరు, ఏలూరు జిల్లా.

ఓ.యస్.నెం. 119/2025

బిట్వీన్ :
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంచ్ మేనేజర్ వట్లూరు బ్రాంచ్, ఏలూరు ...వాది
And
కాంద్రు విజయబాబు, S/o.రాములు,
ధర్మాజీగూడెం, ఏలూరు. ...ప్రతివాది

వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల దావాలో ప్రతివాదికి తెలియజేయునది ఏమనగా పై తెలిపిన కోర్టులో ది.03-02-2026వ తేదీన వాయిదా కలదు. ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేనియెడల కోర్టు వారు పరోక్షంగా, తీర్మానం చేయగలరని తెలియజేయుచున్నాము.

కొండేటి శ్రీనివాసరావు, అడ్వకేట్
పానుగంటి వారి వీధి,
స్థలం: ఏలూరు ఏలూరు.
తేది.30-12-2025 సెల్: 94412 76324

మహారాజశ్రీ 2వ ఎడిషనల్ సివిల్ జడ్జి ఏలూరు, ఏలూరు జిల్లా.

ఓ.యస్.నెం. 309/2025

బిట్వీన్ :
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంచ్ మేనేజర్ సి.ఆర్.ఆర్.బ్రాంచ్, ఏలూరు ...వాది
And
బూరుగు జాన్ కెనడీ, S/o.ఇశ్రాయేలు,
ఏలూరు. ...ప్రతివాది

వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల దావాలో ప్రతివాదికి తెలియజేయునది ఏమనగా పై తెలిపిన కోర్టులో ది.30-01-2026వ తేదీన వాయిదా కలదు. ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేనియెడల కోర్టు వారు పరోక్షంగా, తీర్మానం చేయగలరని తెలియజేయుచున్నాము.

కొండేటి శ్రీనివాసరావు, అడ్వకేట్
పానుగంటి వారి వీధి,
స్థలం: ఏలూరు ఏలూరు.
తేది.30-12-2025 సెల్: 94412 76324

మహారాజశ్రీ 3వ ఎడిషనల్ సివిల్ జడ్జి ఏలూరు, ఏలూరు జిల్లా.

ఓ.యస్.నెం. 120/2025

బిట్వీన్ :
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంచ్ మేనేజర్ గోల్డ్ బజార్ బ్రాంచ్, ఏలూరు ...వాది
And
పండ రమేష్న్ దొర, S/o.గంగరాజు,
ఏలూరు. ...ప్రతివాది

వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల దావాలో ప్రతివాదికి తెలియజేయునది ఏమనగా పై తెలిపిన కోర్టులో ది.30-01-2026వ తేదీన వాయిదా కలదు. ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేనియెడల కోర్టు వారు పరోక్షంగా, తీర్మానం చేయగలరని తెలియజేయుచున్నాము.

కొండేటి శ్రీనివాసరావు, అడ్వకేట్
పానుగంటి వారి వీధి,
స్థలం: ఏలూరు ఏలూరు.
తేది.30-12-2025 సెల్: 94412 76324